క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామ పంచాయతీ కార్యదర్శి గోరంటల దినేశ్ గ్రామ పంచాయతీ నిధులు స్వాహా చేశారని మాజీ ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ ఆరోపించారు. నిధుల స్వాహాపై విచారణ చేపట్టి అతని నుంచి డబ్బులు రికవరీ చేయాలని అధికారులను కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2020 నుంచి 2024 జూన్ వరకు ఇంటి, నల్లా పన్నుల లెక్కలు గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో, గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి దినేశ్ చూపకుండా డబ్బులు కాజేసినట్లు ఆరోపించారు. గ్రామ పంచాయతీ లెక్కలపై విచారణ చేపట్టి అతని నుంచి నిధులు రికవరీ చేసి అతన్ని సస్పెండ్ చేయాలని కోరారు. ఇదే విషయమై మంగళవారం ఎంపీడీఓ ఫణిచంద్రకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



కమలాపూర్ : రిలయన్స్ జియో కంపెనీలో కాంట్రాక్టు టెక్నీషియన్‌గా పని చేస్తున్న మండలంలోని ఉప్పల్‌కు చెందిన మొండెద్దుల శ్రీకాంత్ ఇటీవల బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని సంస్థ సీనియర్ మేనేజర్ పోతిరెడ్డి నవీన్ ఆధ్వర్యంలో తోటి ఉద్యోగులు మంగళవారం రూ.1,05,500 ఆర్థికసాయం అందించారు. శ్రీకాంత్ మృతితో ఆ కుటుంబానికి ఆధారం లేకుండా పోయిందన్న విషయం తెలుసుకున్న నవీన్, తోటి ఉద్యోగులు తలోకొంత పోగుచేసి తమ ఉదారతను చాటుకున్నారు. కన్న కొడుకును కోల్పోయి కష్టకాలంలో ఉన్న తమకు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేసిన వారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కంపెనీ సూపర్‌వైజర్ మణికంత, ఈ సంస్థ ఉద్యోగులు కృష్ణంరాజు, శ్రావణ్, హరీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



నడికూడ : మండలంలోని రాయపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారెం దేవేందర్‌రెడ్డి తండ్రి మారెం కనకారెడ్డి మృతి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కనకారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు దేవేందర్ రెడ్డి, బుర్ర దేవేందర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక



శ్రీను

ధర్మసాగర్ : కబడ్డీ అసోసియేషన్ మండల ఎన్నికను అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎండీ.అజీజ్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు సారంగపాణి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాలిగపు శ్రీను, ప్రధానకార్యదర్శిగా లక్ష్మణ్ యాదవ్, ఉపాధ్యక్షులుగా బెల్లం ప్రేమ్, సాంబరాజు, రంజిత్, వంశీ, కోశాధికారిగా రాజుయాదవ్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్, తరుణ్, దిలీప్, మహేష్, సభ్యులుగా ప్రశాంత్, నీరజ్, రాజ్‌కుమార్, మహేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, ఐదు జోన్ల సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

పీరీల ఊరేగింపు



సంగెం : మొహర్రం సందర్భంగా మండలంలోని గవిచర్ల, ఎల్గూర్ రంగంపేట, తీగరాజుపల్లి, చింతలపల్లి, నల్లబెల్లి, సంగెం తదితర గ్రామాల్లో పీరీలను డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి పీరీలతో దువా ఇచ్చారు.

హజరత్ అలీ దీపారాధన

దుగ్గొండి : మొహర్రం సందర్భంగా మండలంలోని తిమ్మంపేటలో మంగళవారం రాత్రి హజరత్ అలీ దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. బానోజీపేట, తిమ్మంపేట గ్రామాలకు చెందిన పీరీలు (సవార్లు) దీపారాధన కార్యక్రమంలో పాలుపంచుకున్నాయి. పీరీలు ఎత్తుకున్న భక్తులు అగ్నిగుండంలోని నిప్పులపై నడిచారు. జబ్బార్, ఫారూఖ్, సారయ్య, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందిస్తాం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల
- అమ్మమాట- అంగన్‌వాడీ బాటలో భాగంగా ర్యాలీ



శాయంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

శాయంపేట : పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో మంగళవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యనందించడమే గాకా వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉన్నారా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై దృష్టి వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఓ బత్తిని విశాల, సీఏ బోయిని రమ్య, అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, శ్రీలత, ఆయా సుజాత, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ ఎం.పద్మకుమారి సూచించారు. అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు అక్షరాలు నేర్పించి, క్రమశిక్షణలో పెట్టడం అంగన్‌వాడీ కేంద్రాలతోనే సాధ్యమని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా బోధన ఉంటుందని, జాతీయ నూతన విద్యా విధానానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠ్య ప్రణాళిక ప్రకారం ఆట, పాట, కథల ద్వారా విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల శారీరకాభివృద్ధి, మేధాభివృద్ధి, సాంఘికాభివృద్ధి, భావోద్వేగాభివృద్ధి, సృజనాత్మకాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌ఎంఎస్‌సీ, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ సహాయక కమిటీ సభ్యులు తుమ్మ స్వాతి, మండ అనూష, తోడేటి లావణ్య, తల్లులు పాల్గొన్నారు.



దామెర : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



కమలాపూర్ : తల్లులకు అవగాహన కల్పిస్తున్న పద్మకుమారి

దామెరలో..

దామెర : చిన్నారులను అంగన్‌వాడీకి కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల, కోగిల్‌వాయి, పులుకుర్తి, వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో పాఠశాలలకు అనుసంధానంగాఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను చేర్పించాలని అన్నారు. వారికి ఆటపాటలతో కూడిన విద్యా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, శోభారాణి, వాణి, రజిత, వనజ, గౌరీ, సంధ్య, రమ, జయ, ఉదయ, రేణుక, ఫాతిమా, ఆశా కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

వైభవంగా బీరన్న బోనాల పండుగ



బోనాలతో బీరన్న ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఎల్కతుర్తి : ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో మంగళవారం బీరన్న బోనాల పండుగను యాదవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నియమనిష్టలతో బీరన్నకు నైవేద్యంతో కూడిన బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. బీరన్న ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, అధిక లాభాలు చేకూరాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు గోపు భిక్షపతి, కడారి వెంకటయ్య, గద్దం రవి, కడారి రవి, నరిగే చేరాలు, అల్లి కుమార్, కోరె రాజ్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, కడారి సురేందర్, కోరె భిక్షపతి, కోరె పున్నం పాల్గొన్నారు.



విరబూసిన బ్రహ్మకమలాలు

శాయంపేట : ఏడాదికోసారి పుష్పించే అరుదైన బ్రహ్మ కమలం అందంగా విరబూసి చూపరులను ఆకట్టుకుంది. మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన వన ప్రేమికుడు కోమినేని రఘు తనఇంటి ఆవరణలో పెంచుతున్న బ్రహ్మకమలం మొక్కకు సోమవారం అర్ధరాత్రి ఏడు పువ్వులు వికసించాయి. 2006లో రఘుకు తన మిత్రుడు బ్రహ్మకమలం మొక్కను బహూకరించగా వాటిని పెంచుతున్నట్లు చెప్పారు. 2016 నుంచి బ్రహ్మకమలాలు ప్రతి ఏటా ఒకసారి వికసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకేసారి ఏడు పుష్పాలు వికసించడంతో విషయం తెలుసుకున్న స్థానికులు అధిక సంఖ్యలో వచ్చి అరుదైన పుష్పాలను తిలకించారు. ఈ పుష్పాలను సాంప్రదాయ వైద్యంలో వినియోగిస్తారని దీనిని ఆర్చిడ్‌కాక్టస్‌గా పిలుస్తారని రాత్రి సమయంలో వికసించే ఈ మొక్కను క్వీన్ ఆఫ్ ది నైట్, నైట్ బ్లూమింగ్ సెరియస్‌గా పిలుస్తారని రఘు వివరించారు.

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీఆర్డీఓ నాగపద్మజ

దామెర : ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేంది లేదని, నిర్లక్ష్యం ప్రదర్శించొద్దని డీఆర్డీఓ నాగపద్మజ హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 4వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు రికార్డులను తనిఖీ చేసి అనంతరం ప్రజావేదికలో గుర్తించిన లోపాలను తెలిపారు. తక్కళ్లపహాడ్, దామెర, కోగిల్వాయి, సింగరాజుపల్లి గ్రామాల్లో కూలీలకు సంబంధించిన మస్టర్లలో తప్పులు ఉన్నాయన్నారు. పలు గ్రామాల్లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షించిన పనుల్లో కొలతల్లో లోపాలను గుర్తించి ఏఈలతకు రూ.9,683 జరిమానాను విధించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో వారికి జరిమానాను విధించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ. 4కోట్లు 17లక్షలు విలువ గల పనుల్లో లోపాలను గుర్తించి రూ. 37,870 జరిమాన విధించామన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతీ పని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధితో పాటు కూలీలకు వేతనం అందించే వరకు బాధ్యత వారిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎం సాయి జ్ఞానేందర్, ఏఎండీవీసీ సాగరిక, అంబుడ్స్‌మెన్ నాగరాజు, ఎస్‌క్యూసీఓ శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీటీసీ సురేందర్, ఎస్ఆర్పీ కొమురయ్య, ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద, ఈసీ, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘనసన్మానం



నర్సంపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మూడోసారి ఎన్నికైన సందర్భంగా పాలాయి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీ మగ్దుంపురం గ్రామ నాయకులు పార్టీ కార్యాలయంలో మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మాజీ ఎంపీటీసీ స్వరూప ఓదయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతినాయక్, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపినాయక్, కాంగ్రెస్ పార్టీ మగ్దుంపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు వరంగంటి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు ఇస్లావత్ నరాన్, శానపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయంగా కళాశాల

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలకు నిలయంగా తయారైందని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, డీవైఎఫ్ఐ నాయకుడు గడ్డమీది బాలకృష్ణ ఆందోళన వెలిబుచ్చారు. పట్టణంలోని ద్వారకాపేట రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏబీఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం బురదలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్, బాలకృష్ణ మాట్లాడారు. కళాశాలలో వివిధ మండలాల నుంచి సుమారు 350 మంది పేద విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారని చెప్పారు. కళాశాల భవనం శిథిలావస్థలో ఉందని, ఇటీవల కురిసిన వర్షాలకు తగతి గదుల పెచ్చులూడిపోయాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేవని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇకనైనా కళాశాలకు నూతన భవనం నిర్మింపజేయాలని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రసాద్, రఘు, శ్రీధర్, మురళి, ప్రవళిక, భాగ్యలక్ష్మి, రజియా, కావ్యశ్రీ, అనిత, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ఎదుట బురదలో కూర్చుని నిరసన తెలుపుతున్న నాయకులు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

ఖానాపురం : పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలమని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీం లీడర్ నెల్లుట్ల సుమన్ స్పష్టం చేశారు. రాగంపేట, తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో బృందం పాటలతో ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కళాకారులు పాల్గొన్నారు.

దేవీలాల్‌తండా సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి..

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని దేవీలాల్‌తండా వాసులు తండాలో నెలకొన్న సమస్యలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. తొలుత ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తండాలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా తండావాసులతో ఎమ్మెల్యే మాట్లాడారు. తండాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తండా శివారులోని ప్రభుత్వ భూమిలో స్మశాన వాటిక నిర్మించుకోవాలని చెప్పారు.

డీటీ వెంకటేశ్‌పై చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట : కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని తహసీల్దార్ కార్యాలయ రికార్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ ఆత్మహత్యకు కారకుడైన డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రశాంత్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. గిర్దావర్ స్వామి, జూనియర్ అసిస్టెంట్ శోభారాణి, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

పర్వతగిరి : తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ ప్రశాంత్‌ను వేధింపులకు గురి చేసిన డీటీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు.

‘సీజనల్’ పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ, ఇతర మండల స్థాయి అధికారులు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీటి గుంటలు, మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డేగా పాటించాలని అన్నారు. గ్రామ పంచాయతీ రిజిష్టర్‌లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు విధిగా సంతకాలు చేయాలని, గ్రామస్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. అనంతరం సీహెచ్‌సీ సూపరింటెంట్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ.. వ్యాధులు వచ్చిన తర్వాత బాధపడటం కంటే వ్యాధులు రాకముందే జాగ్రత్త పడటం మంచిదని అన్నారు. దోమలు, నీరు, గాలి ద్వారా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు నివారణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య, ఉప కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేశామని అన్నారు. వారు అవగాహన సదస్సులు, ఉచిత శిబిరాలు నిర్వహిస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతారని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతిరోజు ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జ్వరం, జలుబు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఎంపీఓ రవి, పల్లె దవాఖాన వైద్యులు శివకుమార్, రజా హైదర్, అరుణ్‌కుమార్, మాధవి, మౌనిక, రేణుక, రోహిత్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ రవీందర్, పీహెచ్ఎస్ లీలావతి, హెల్త్ సూపర్‌వైజర్లు విప్లవ్‌కుమార్, అమృత, మరియా థామస్, కనుకలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, బాబు, రాము, గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు, కమలాపూర్, ఉప్పల్ పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సల్లగ చూడు ‘సీత్లా భవాని’



పూజలు చేస్తున్న తండావాసులు

శాయంపేట : మండలంలోని సూర్యనాయక్ తండలో మంగళవారం లంబాడీలు సీత్లా భవాని పండగను ఘనంగా నిర్వహించారు. పంటలు పండాలని, దుష్టశక్తులు తండ ప్రజలకు దరిచేరకుండా చూడాలని సల్లగ చూడు సీత్లా భవాని అంటూ వేడుకున్నారు. అనంతరం మాజీ సర్పంచ్ భూక్య రమేశ్ మాట్లాడుతూ.. సీత్లా పండగను ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో బంజారా తండావాసులు జరుపుకొంటారని తెలిపారు. సీత్లా భవాని పండుగ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయలను ప్రతిబింభిస్తుందని అన్నారు. ‘సీత్లా’ వేడుకలతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రెడ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కుల పెద్దలు పాల్గొన్నారు.

నిరుపేదలకు నివాస స్థలాలు ఇవ్వాలి

ధర్మసాగర్ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నివాస స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి నేదునూరి రాజమౌళి డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ సదానందంకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు తీసుకుందని, వాటి ప్రకారం పేదల అవసరాలను తీర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ.. పెద్దపెండ్యాల, ధర్మసాగర్, రాంపూర్ గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని అన్నారు. వారందరికీ పట్టాలు ఇచ్చి గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కుల పోరాట సమితి నాయకుడు శంకర్, మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు బట్టు మల్లయ్య, రత్నం, దాసు, రాజయ్య, అంకూస్, బాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మల్లన్న ఆలయంలో మాససంక్రమణ పూజలు

ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో రవి సంక్రమణం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవారం ఉదయం నిత్యపూజల అనంతరం స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం జరిపించారు. గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మతో శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం జరిపించారు. అదే విధంగా ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేసి ఒగ్గుపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు మధుకర్ శర్మ, వేద పండితులు పురుషోత్తమశర్మ, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఒగ్గు పూజారులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎక్సైజ్ సీఐ తాతాజీ

హన్మకొండ (పరకాల) : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ సీఐ తాతాజీ సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలతో వచ్చే అనర్థాలపై మంగళవారం పట్టణంలోని ఎస్వీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. గంజాయి, మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువత బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏవరైనా గంజాయి తీసుకుంటే వెంటనే సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అన్నారు. చెడు స్నేహానికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల, గురువుల మాట వినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు జ్యోతి, సులోచన, ఎస్వీ విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సీఐ తాతాజీ